క్లుప్తంగా

రిపబ్లిక్ డేకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వెంకటాచలం: ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే క్యాంప్ 2024కు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ(వీఎస్‌యూ) ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపిక కావడం గర్వకారణమని వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శనివారం రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపికైన వలంటీర్లు ఎస్.అనిత, కె.చందనలను అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రిపబ్లిక్ డే క్యాంపునకు ఒకరు ఎంపిక కావడమే కష్టమని, వీఎస్‌యూ నుంచి ఇద్దరు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. దీని వెనుక ఎన్ఎస్ఎస్ విభాగం కృషి ఎంతో ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ అధికారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ముత్తుకూరు : విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎఫ్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో సీఎస్సార్ ద్వారా యూపీస్కూల్‌కు రూ.50,000ల విలువ గల రెండు కంప్యూటర్లు, వాటి పరికరాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జెమినీ ఫ్యాక్టరీ ద్వారా త్వరలో అదనపు గది నిర్మాణం జరుగుతుందన్నారు. యూపీ స్కూల్ హెచ్ఎం కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, ఫ్యాక్టరీ అధికారి సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

పొదలకూరు : అయోధ్య రామమందిరం నుంచి తీసుకొచ్చిన శ్రీరాముని అక్షతలకు పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత దేవస్థానం నుంచి శోభాయాత్ర చేపట్టి రామనగర్‌గేటు సెంటర్ మీదుగా రామమందిరం వద్ద హారతులు ఇచ్చారు. అక్కడి నుంచి శివాలయం వరకు యాత్రను నిర్వహించారు. యాత్రలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ బాధ్యులకు అక్షతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ జిల్లా బాధ్యులు మాట్లాడుతూ అయోధ్య రామమందిరంలో జనవరి 22న విగ్రహ ప్రతిష్ఠ సమయానికి దేశంలో 25 కోట్ల కుటుంబాలకు అక్షతలు చేరేలా ధార్మిక సంస్థలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచారక్ సురేష్, జనార్దన్‌రెడ్డి, అక్షింతల వితరణ కమిటీ సభ్యులు సుందరరాజా, ధనుంజయరావు, వేణుగోపాల్‌రెడ్డి, మోహన్, లక్కాకుల ఆనందరావు, రాచపూటి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు బాగుండాలి

కోవూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతులు బాగుండాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని పాటూరు, కోవూరు, పడుగుపాడు ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు, నీటి వసతి తప్పక ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 7వ తేదీలోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.పద్మజ, ఆర్ఐ రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• విడవలూరు : మండలంలోని పార్లపల్లి, విడవలూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జేసీ కూర్మనాథ్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, సీసీ కెమెరాలు వంటి మౌలిక వసతుల కల్పనకు జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ రమాదేవి, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, రవిదర్శిని, మహిళా కానిస్టేబుల్ శ్రీలేఖ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పల్లకిసేవ

దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా దయాకర్‌రెడ్డి–శిరీష దంపతులు వ్యవహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పల్లకిసేవ నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు.

10 నుంచి క్రికెట్ టోర్నీ

వెంకటాచలం : సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 10వ తేదీ నుంచి వెంకటాచలంలో వీసీఎల్(వెంకటాచలం ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది టీమ్‌లు పాల్గొంటాయని, వీసీఎల్ విజేతకు రూ.1.20 లక్షలు, రన్నర్‌గా నిలిచే జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. వెంకటాచలం మండల యువతను ప్రోత్సహించాలనే ఆలోచనతో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కేసులు పరిష్కారమయ్యేలా చూడండి


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి అవసరమైన అన్ని ఫైళ్లను సకాలంలో సిద్ధం చేసి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థలోని అన్ని విభాగాధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల వివరాలను కమిషనర్ ఆరాతీశారు. నగరపాలక సంస్థకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాలని సూచించారు. కార్పొరేషన్ సూచించిన నిబంధనల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మేనేజర్ ఇనాయతుల్లా, లీగల్ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీ

రామ్‌జీనగర్‌లోని 1, 2 వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ తనిఖీ చేశారు. సచివాలయంలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు సాధించాలని కోరారు.

➡ మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందితో మెయిన్ రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో పనులు చేయిస్తున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఇంట్లోని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. ప్రత్యేక సిబ్బంది, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను సిద్ధం చేసి అన్ని డివిజన్లలో క్రమపద్ధతిలో చెత్త సేకరణను రెండు షిఫ్టుల్లో చేపట్టామని తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి


జెడ్పీ కార్యాలయంలో..


ఏపీజీఈఎఫ్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(దర్గామిట్ట): ఏపీ వైద్య, ఆరోగ్య కుటుంబ ఉద్యోగుల సంక్షేమ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. మంత్రిని ముత్యంగౌడ్, జిల్లా హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ప్రదీప్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నేత రాజేష్, సెంట్రల్ కో ఆపరేటివ్ సంఘ రాష్ట్ర నేత కుమార్‌పాల్, ఏపీ వైద్య, ఆరోగ్య కుటుంబ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయ పరిపాలనాధికారుల సంఘం, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సీఈఓ చిరంజీవి శనివారం ఆవిష్కరించారు. జెడ్పీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జలవనరుల శాఖ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, ఇరిగేషన్ సర్కిల్ యూనిట్, జిల్లా ఆధ్వర్యంలో నూతన సంవత్సర టేబుల్ కాలెండర్లను జిల్లా జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణమోహన్ ఆవిష్కరించారు. రామలింగాపురంలోని జలవనరుల శాఖ ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జలవనరుల శాఖ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘ నెల్లూరు అధ్యక్షుడు నాయుడు వెంకటస్వామి, కార్యదర్శి మార్కండేయులు, సర్కిల్ యూనిట్ గౌరవాధ్యక్షుడు రవికుమార్, అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: ఏఎన్ఎం ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆవిష్కరించారు. నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీవీడబ్ల్యూస్‌హెచ్‌జీఈఏ రాష్ట్ర అధ్యక్షులు స్నేహలత, జిల్లా కార్యదర్శులు హైమావతి, కళావతి, ట్రెజరర్ రజనీకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాగ్యలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ సునీత, రజిత, రత్నకుమారి, సరితాకుమారి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): వీఆర్సీ సెంటర్‌లోని ఓ భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్ నెల్లూరు జిల్లా టేబుల్ క్యాలెండర్లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీజీఈఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవ పాల్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి మాట్లాడారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 20 ఏళ్లుగా సేవలందిస్తున్న పలు శాఖల్లోని 11 వేలకుపైగా ఉద్యోగుల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెగ్యులర్ చేయించడంపై కృతజ్ఞతలను తెలియజేశారు. ఇందిరా డెంటల్ ఆస్పత్రి అధినేత వివేకానందరెడ్డి, ఏపీజీఈఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, హంస రాష్ట్ర నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ అనంతరం శేషజీవితాన్ని హాయిగా గడపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కాంక్షించారు. సీసీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న సత్యవతి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో పోలీస్ కార్యాలయంలో ఆమెను ఎస్పీ సత్కరించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి హోంగార్డు యూనిట్‌కు మంచిపేరు తీసుకురావడాన్ని అభినందించారు. హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


సౌజన్యలక్ష్మి

నెల్లూరు (టౌన్): మూలాపేటకు చెందిన సౌజన్యలక్ష్మికి డాక్టరేట్ లభించింది. సముద్ర తీర మత్స్యకారుల అభివృద్ధిలో ఆర్థిక పాత్ర అనే అంశంపై వీఎస్‌యూలోని కావలి కళాశాలలో కామర్స్ విభాగంలో ప్రొఫెసర్ వెంకట్రావు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను వీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు.

సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు

నెల్లూరు (టౌన్): సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని నారాయణ డెంటల్ కళాశాల హెచ్ఓడీ కణ్ణన్ పేర్కొన్నారు. కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఒమేగా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావును సత్కరించారు. మినిస్ట్రీస్ చైర్‌పర్సన్ గ్లోరీ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, శ్వేత, వియానీ హోమ్ సిస్టర్లు రమ, జయ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ పొడిగింపు

నెల్లూరు (లీగల్): ఏపీ భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేపట్టిన కోర్టు విధుల బహిష్కరణను జనవరి ఐదు వరకు పొడిగిస్తున్నామని బార్ అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. సివిల్ కేసుల అవుట్‌అప్ ఆర్డర్లు, క్రిమినల్ కేసుల బెయిళ్లకు మినహాయింపునిచ్చామన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నెల్లూరు(బృందావనం): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుబహాన్ కోరారు. మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని తన కార్యాలయంలో ట్రాఫిక్ డీఎస్పీ, సౌత్ ట్రాఫిక్ సీఐ వేమారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఐవైఎం నెల్లూరు బాధ్యులు సాజిద్, జిలానీ, జమీర్, సందానీ, ఇమ్రాన్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది అక్టోబర్ నాలుగు నుంచి శనివారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.9,09,348 మేర సమర్పించారని ఈఓ ఆరంబాకం వేణుగోపాల్ తెలిపారు.

ఎన్నికను సజావుగా నిర్వహించాలని వినతి


ఆనం అరుణమ్మకు వినతిపత్రమిస్తున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): జెడ్పీ యూనిట్ సభ్యుల ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జెడ్పీ పరిపాలనాధికారులు శైలజ, కొండయ్య, సుబ్బారావు, వసంతకుమారి, ప్రభావతి బాయి కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. జెడ్పీ యూనిట్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను ఈ నెల 24న ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించారని చెప్పారు. జెడ్పీ సీఈఓ అనుమతి లేకుండా.. ఉద్యోగులకు ఎలాంటి సమాచారమివ్వకుండా ఏకగ్రీవ ఎన్నికను ఏకపక్షంగా నిర్వహించారని తెలిపారు. వచ్చే నెల మూడున జెడ్పీ ఉద్యోగులు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనున్నారన్నారు.

ఘనంగా గ్రామీణ సువార్త ప్రార్థన కూడిక



నెల్లూరు(బృందావనం): గ్రామీణ సువార్త – విశ్వాసుల పరిచయ ప్రార్థన కూడికను బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్ సువార్త బృంద ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ సమీపంలోని చర్చిలో ఎవాంజలిజమ్ డైరెక్టర్ గంటా జార్జి స్టీవెన్సన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్‌శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, చర్చి చైర్మన్ సురేంద్రబాబు, ఎవాంజలిజమ్ పాస్టర్ జాన్, బ్రదర్ జానీజో, సువార్త బృంద సభ్యులు నాగయ్య, దంతం రవికుమార్, అవినాష్, హిల్డా శ్యామ్‌సన్, ఆషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆడుదాం.. ఆంధ్రాలో భాగంగా 11 బ్యాడ్మింటన్ మ్యాచ్‌లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎస్డీఏ యతిరాజ్ పర్యవేక్షించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రముఖ క్రికెటర్, ప్రొఫెసర్ రమణ మెమోరియల్ టీ – 20 లీగ్ కమ్ నాకౌట్ పోటీలను నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. నగరంలోని సీఏఏ క్రికెట్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణరావుపేట క్రికెట్ క్లబ్, మైపాడు క్రికెట్ క్లబ్‌ల మధ్య మ్యాచ్‌లో మైపాడు క్రికెట్ క్లబ్ 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. జూనియర్స్ ఎలెవెన్ క్రికెట్ క్లబ్, టెన్ కౌషల్ క్రికెట్ క్లబ్ మధ్య జరిగిన పోటీల్లో జూనియర్ ఎలెవెన్ క్రికెట్ క్లబ్ ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. క్రికెట్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, జిల్లా క్రికెట్ కేర్‌టేకర్ శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి అబూబకర్, జాయింట్ సెక్రటరీ మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

జయభారత్ ఆస్పత్రికి విరాళం



నెల్లూరు సిటీ: నగరంలోని జయభారత్ హాస్పిటల్ నిర్వహిస్తున్న సంజీవని వైద్యసేవా పథకానికి రూ.1.5 లక్షల విరాళాన్ని సంస్కృత అధ్యాపకుడు బండి విశ్వనాథం జ్ఞాపకార్థం బండి సత్యమురళి శనివారం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యానికి ఇచ్చారు. జనరల్ మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

పొట్టేపాళెం వాసికి గౌరవ డాక్టరేట్



నెల్లూరు రూరల్: పొట్టేపాళేనికి చెందిన గణిత శాస్త్ర అధ్యాపకుడు లక్ష్మీప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో రాపత్తు ఉత్సవాలు


రంగనాథస్వామి దేవస్థానంలో..


వేణుగోపాలస్వామి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అనుమాలశెట్టి నరసింహులుశెట్టి వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

• మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వాకాటి గోపీకృష్ణ దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


అక్కినేని, ఘంటసాల చిత్రపటాలకు నివాళి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో అక్కినేని నాగేశ్వరరావు, అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంత్యుత్సవాలను సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి చిత్రపటాలకు నివాళులర్పించారు. సినీ సంగీత విభావరి అలరించింది. కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దోనిపూడి కేశవనారాయణమూర్తి, డాక్టర్ మారం సుధాకర్, రియాజ్‌బాషా, పద్మజారెడ్డి, సుజాతరెడ్డి, పేర్నూరి ప్రదీప్, శింగంశెట్టి మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నేతల ధర్నా

నెల్లూరు (వేదాయపాళెం): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని విడుదల చేయాలని డీవైఎఫ్ఐ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని గాంధీబొమ్మ వద్ద ధర్నాను శనివారం చేపట్టారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, నగర కార్యదర్శి నరసింహ, నేతలు ఫయాజ్, సుబ్బరాయుడు, బాలు, పవన్, జీవ నాగేంద్ర, లోకేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.